దారిచేరిన చెత్త



మల్లేశ్వరం వద్ద జాతీయ రహదారి పక్కన చెత్త

- డంపింగ్ యార్డుగా జాతీయ రహదారి
- నిత్యం ప్రజలకు తప్పని పాట్లు
- రోజురోజుకూ పెరుగుతున్న వ్యర్థాలు

పెరవలి: వెళ్లే దారి వెక్కిరిస్తోంది.. చెత్తతో స్వాగతం పలుకుతోంది.. ముక్కుపుటాలు అదిరేలా చెత్త కంపు కొడుతోంది.. అయినా అదే నిర్లక్ష్యం వెంటాడుతోంది.. దీంతో సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది.. పెరవలి నుంచి సిద్ధాంతం వరకూ ఉన్న సుమారు 13 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి పరిస్థితి ఇది. ఇందులో ప్రతి గ్రామం వద్ద చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీనివల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. గాలి వీచేటప్పుడు, వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు చెత్త నుంచి కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఎగిరి వచ్చి వాహనాలపై పడటంతో డ్రైవర్లు వాటిని తీయబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు. పెరవలిలో జాతీయ రహదారికి ఇరువైపులా కాఫీ, భోజన హోటళ్లు, వివిధ వ్యాపార సంస్థలు ఉండటంతో వారు నిత్యం చెత్తను తీసుకువచ్చి



ఖండవల్లి వద్ద చెత్తను తగులబెట్టడంతో రోడ్డును కమ్మేస్తున్న పొగ

రోడ్డు పక్కనే పడేస్తున్నారు. అంతేకాకుండా నిల్వ పదార్థాలను ఇక్కడే వేయడంతో దుర్వాసన వస్తుందని ప్రజలు వాపోతున్నారు. దీంతో ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా కోళ్ల, చేపల వ్యర్థాలు వేయడంతో అవి కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. పంచాయతీల ఆధ్వర్యంలో అప్పుడప్పుడూ చెత్తను తొలగిస్తున్నా ఇబ్బంది మాత్రం తగ్గడం లేదు. జాతీయ రహదారికి ఇరువైపులా ఉండే గృహస్తులు నానా అగచాట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వాహనాల వేగంతో పాటు ఈ చెత్త నుంచి వచ్చే చెడు వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

పొగపెట్టి.. పగబట్టి

చెత్త కుప్పలను తరలించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు అధికారులు అనేక ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ చెత్తకు నిప్పుపెట్టి వదిలివేయటంతో అవి రోజుల తరబడి కాలుతూ పొగ రావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వాహనదారులకు ఎదురు వచ్చే వాహనాలు కనబడం లేదు. గృహస్తులైతే దుర్గంధంతో పాటు ఈ పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రహదారిని ఆనుకుని ఉన్న పెరవలి, నల్లాకులవారిపాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల వద్ద చెత్త కుప్పలు అధికంగా ఉన్నారు. ఇక్కడే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. గత కలెక్టర్ కె.మాధవీలత అన్నవరప్పాడు వచ్చినప్పుడు ఇది జాతీయ రహదారా లేక డంపింగ్ యార్డా అంటూ పంచాయితీ అధికారులను



పెరవలి వద్ద..

నిలదీశారు. తిరిగి వచ్చినప్పుడు పరిస్థితి ఇలానే ఉంటే సస్పెండ్ చేస్తానని పెరవలి మండల పంచాయతీ విస్తరణాధికారిని హెచ్చరించారు. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు స్పందించి చెత్త సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముక్కుమూసుకుని వెళ్తున్నాం



జాతీయ రహదారిపై ప్రయాణం అంటే ప్రమాదానికి నిలయంగా మారింది. చెత్త కుప్పల కారణంగా వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నాం. ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తుంది. అయినా అధికారులు పట్టించుకోవటం లేదు. సమస్య తీరక నానా అవస్థలు పడుతున్నాం.

– దొడ్డిగర్ల బాలకృష్ణ, పెరవలి

పొగతో అవస్థలు



డంపింగ్ యార్డుగా జాతీయ రహదారి మారుతోంది. గ్రామ కూడళ్ల వద్ద చెత్తాచెదారం వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. చెత్తకుప్పలను తగులబెట్టినప్పుడు వాటి నుంచి వెలువడే పొగతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– డి.నాగరాజు, ప్రయాణికుడు

పలు వేడుకలకు తలారి హాజరు



గజ్జరంలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

తాళ్లపూడి: కొవ్వూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో పలు శుభ కార్యక్రమాలకు హాజరయ్యారు. గజ్జరం గ్రామానికి చెందిన అక్కాబత్తుల ప్రవీణ్ వివాహ వేడుకలో తలారి వెంకట్రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా కొవ్వూరు మండలం చిడిపి గ్రామస్తుడు కొయ్య పేరయ్య మనమరాలి ఓణీల ఫంక్షన్‌లో తలారి పాల్గొని చిన్నారికి అక్షితలు వేసి ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పిట్టా శ్రీనివాస్, గండి రాంబాబు, ఎల్లిన శివ, గుంటూ చిన్నబ్బాయి, కొయ్యే దుర్గారావు, ఎల్లిన శ్రీను, చిక్కాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపిక

ప్రకాశంనగర్: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది క్రీడా అంశాల పోటీలు, ఎంపిక విధానంలో మొదటి రోజు శనివారం స్థానిక ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో ఖోఖో, కబడ్డీ జట్ల పోటీలు, ఎంపిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాప్ డైరెక్టర్ పి.రవీంద్రనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడాల్లోను రాణించాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

రేపటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి: అనంతపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ తెలికిచర్ల ఫీడర్ చోడవరంలో ఆర్‌డీఎస్‌ఎస్ లైన్ నిర్మాణం నిమిత్తం ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ ఫీడర్‌కు 3 ఫేజ్ సరఫరా ఉదయం 3 గంటల నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇస్తామన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి అభినందనీయం



తిమ్మరాజుపాలెంలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పల్లారావు, రోటరీక్లబ్ సభ్యులు

నిడదవోలు రూరల్: పర్యావరణ పరిరక్షణకు రోటరీ క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, రోటరీ సభ్యుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ నిడదవోలు ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు పండ్ల మొక్కలను శనివారం అందజేశారు. మొక్కల పెంపకంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలని క్లబ్ సభ్యులు సూచించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మీసాల హరిప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, సభ్యులు యాసరపు రామకృష్ణ, సానెపు వెంకట సుబ్బారావు, హెచ్‌ఎం ఎస్.హెప్సిబా, పీడీ చిక్కాల సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నిడదవోలు రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారి ఆలయంలో ఈ నెల 15న ఉదయం 9.30 గంటల నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. పూజలో పాల్గొనే ముత్తయిదువులకు పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదం ఉచితంగా అందిస్తామని, మిగిలిన పూజా సామగ్రి విధిగా తీసుకు రావాలని ఆయన సూచించారు. వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనే మహిళలు ఆలయ కౌంటర్ వద్ద ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

'మానవత' చేయూత



అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

దేవరపల్లి: నల్లజర్ల మండలం పోతవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న గెడ్డం పుల్లయ్య, రంగయ్య, గంజి జానుకు ఒక్కొక్కరికి రూ. 4 వేల చొప్పున శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సాయం చేశారు. మండల అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరరావు, కన్వీనర్ గుళ్లపూడి వెంకటరత్నం, కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, కోశాధికారి ఐడీ అప్పారావు, మన్యం రామచంద్రం, జేడీ ఏలేటి శ్రీనివాసరావు, కేజేడీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాలగ్రామ హారం సమర్పణ



వేంకటేశ్వరునికి సాలగ్రామ హారం అలంకరణ

నిడదవోలు: స్థానిక బసివిరెడ్డిపేట పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున వేంచేసి ఉన్న వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారికి శనివారం సాలగ్రామ హారం సమర్పించారు. భక్తులు, దాతల సహకారంతో తయారు చేయించిన రూ.1.75 లక్షల విలువైన సాలగ్రామ హారాన్ని సంప్రోషణ చేసి, దాతల గోత్రనామాలతో పూజ చేసిన అనంతరం స్వామివారికి అలంకరించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారి అలంకరణను తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు వాసా వెంకట సురేష్, కోనా వెంకట ప్రతాప్‌లు ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెలగల జయచంద్రారెడ్డి, కేదారిశెట్టి నెహ్రూ, అర్చకుడు రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



దేవరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

దేవరపల్లి: రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం దేవరపల్లిలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున ఆలయ ప్రధాన అర్చకుడు స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం వివిధ రకాల పండ్ల రసాలు, జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. సుదూర ప్రాంతాల నుంచి అనేక మంది కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. సమీపంలోని ఉమారామలింగేశ్వరస్వామి, షిర్డీసాయిబాబా మందిరం, విజయదుర్గాదేవి, గ్రామ దేవత కడియాలమ్మ తల్లి ఆలయాలకు భక్తుల రద్దీ ఏర్పడింది. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా స్వర్ణ పుష్పార్చన, గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి తొమ్మండ్రు రమేష్ దంపతులు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

దేవరపల్లి: రాఖీ పండగను పురస్కరించుకుని రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత పలువురికి రాఖీలు కట్టారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వనిత రాఖీ కట్టారు. ఆమెకు వేణుగోపాలకృష్ణ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం ఎయిర్ పోర్ట్‌లో పలువురు పోలీస్ అధికారులు, సీఐఎస్‌ఎఫ్ అధికారులకు ఆమె రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, త్యాజంపూడి ఉప సర్పంచ్ కుసులూరి వెంకటసతీష్‌కు ఆమె రాఖీ కట్టారు. శ్రావణ మాసంలో



ఎయిర్ పోర్ట్‌లో పోలీసు అధికారులకు రాఖీ కడుతున్న మాజీ హోం మంత్రి తానేటి వనిత

సోదర, సోదరీమణుల అనుబంధాన్ని రాఖీ పౌర్ణమి గుర్తు చేస్తుందని ఆమె అన్నారు. ఉదయం



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణకు రాఖీ కడుతున్న మాజీ హోం మంత్రి వనిత

తాడేపల్లిగూడెంలోని స్వగృహంలో పలువురు పార్టీ కార్యకర్తలకు రాఖీలు కట్టారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలు



టార్గెట్ బాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

చాగల్లు: స్థానికంగా రాష్ట్ర స్థాయి టార్గెట్‌బాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఏపీ టార్గెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ అన్నారు. చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు శనివారంతో ముగిశాయి. ఇందులో విజేతలకు బహుమతులను సురేష్ కుమార్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పోటీలు నిర్వహించడానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలను ఏపీ టార్గెట్ బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ జె.విజయలక్ష్మి వెల్లడించారు. బాలికల విభాగంలో తూర్పుగోదావరి జిల్లా ప్రథమ, పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయ, విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. అదేవిధంగా బాలుర విభాగంలో విశాఖ జిల్లా జట్టు ప్రథమ, తూర్పుగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, నంద్యాల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో బెస్ట్ షూటర్‌గా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అభిరామ్, బెస్ట్ డైమండ్‌గా వైజాగ్‌కు చెందిన భాస్కర్, బాలికల విభాగంలో బెస్ట్ షూటర్లుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఆర్.నవ్య, డి.మౌనిక, బెస్ట్ డైమండ్‌గా టి.అనూష నిలిచారు. అలాగే మిక్స్ టార్గెట్ బాల్‌లో వైజాగ్ జిల్లా ప్రథమ, తూర్పుగోదావరి జిల్లా జట్టు ద్వితీయ, శ్రీకాకుళం జిల్లా జట్టు తృతీయ స్థానాలు సాధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.వాసవి, ఆర్‌వీ ప్రసాద్, ఎండీ నఫీజ్, కొవ్వూరు జోన్ వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో బలరామ జయంతి

సీటీఆర్ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో శ్రీ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ ఆధ్వర్యంలో బలరామ జయంతిని శనివారం గోపూజతో ప్రారంభించారు. ఆశ్రమ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస బ్రహ్మచారి మాట్లాడుతూ పదో తేదీన భగవద్గీత పోటీలు, 13న సాయంత్రం భరత నాట్య ప్రదర్శన, 14న సాయంత్రం భగవద్గీత పోటీ విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. 16వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం సాయంత్రం 5 గంటల నుంచి హరి నామ సంకీర్తనం, ఉట్టి కొట్టడం, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, గురుపూజ, ప్రవచనం, రాత్రి 11 గంటలకు బాలగోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, 108 దీపాలతో మహా హారతి, గోదావరి మాతకు హారతి ఇస్తారు.

33వ రోజుకు సత్యసాయి ప్రాజెక్టు కార్మికుల సమ్మె

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్ల అమలు కోసం శ్రీసత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లయి ప్రాజెక్టు కార్మికులు స్థానికంగా చేస్తున్న సమ్మె శనివారానికి 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శ్రీను, ఇస్సాక్‌లు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 20 నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, 26 నెలలుగా కట్టాల్సిన పీఎఫ్, ఈఎస్ఐల సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు పస్తులతో ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కార్మికులు కోరుతున్నారు.

నిష్కల్మషమైన జీవితాలకు సాక్ష్యాలు ఆదివాసీలు



ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు

- జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
- ఆకట్టుకున్న ఆదివాసీ సంప్రదాయ నృత్య ప్రదర్శన

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రకృతిని నమ్ముకుని జీవించే నిష్కల్మష హృదయాలు కలిగిన వారు ఆదివాసీయులని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని ఇన్‌చార్జి జిల్లా ట్రైబుల్ అధికారి బి.శశాంక అధ్యక్షత వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కొమరం భీమ్, బిర్సా ముండ, ఏకలవ్యుడు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకృతిని కాపాడుతున్న అడవి బిడ్డలకు శుభాకాంక్షలు తెలిపారు. సమష్టి జీవన పద్ధతులు, పరస్పర సహకారం, ప్రాచీన చరిత్రకు, సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే జీవన శైలి ఆదివాసుల సొంతమన్నారు. ఆదివాసీలు నేటికీ అనేక రంగాల్లో వెనకబాటులోనే ఉన్నారని, విద్య ద్వారానే నాగరిక సమాజంలో కలిసి తమ హక్కులను ఉనికిని కాపాడుకోగలుగుతారన్నారు. చిన్ననాటి నుంచే గిరిపుత్రులు తగిన లక్ష్యాలను నిర్దేశించుకొని, అందుకు తగ్గ సాధన, శ్రమ ద్వారా వాటిని చేరాలని ఆయన ఆకాంక్షించారు. అప్పుడే మీ నుంచి ఐఏఎస్‌లు, ఐపీఎస్ లు, డాక్టర్లు, లాయర్లు, ఇంజినీర్లు పుట్టుకొస్తారని పేర్కొన్నారు. శ్రమ విషయంలో దృష్టి పెట్టాలన్నారు. తద్వారా పారిశ్రామికంగాను రాణిస్తారన్నారు. అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు మాట్లాడుతూ గిరిజనులు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఆదివాసీ దినోత్సవంలో భాగంగా 20 మంది ఆదివాసీలను ఘనంగా దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖా జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు వైజంక్షన్ వద్ద గల కలెక్టర్ బంగ్లా వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుక.. ఖరీదైన వేదిక

- శ్రావణ మాసంలో జోరుగా సాగుతున్న పెళ్లిళ్లు
- మధ్య తరగతి ప్రజలకు తప్పని ధరాఘాతం

రాజమహేంద్రవరం రూరల్: శ్రావణ మాసం శుభకార్యాలకు పెట్టింది పేరు. నెలంతా ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్ల సందడి మొదలైంది. జంటలు ఒక్కటయ్యేందుకు సిద్ధమయ్యారు. జిల్లా వ్యాప్తంగా పల్లె, పట్టణం తేడా లేకుండా పెళ్లిళ్ల హడావుడి కనిపిస్తోంది. ఊరూరా బాజాబజంత్రీలు మోగుతున్నాయి. పెరిగిన ఖర్చులతో మధ్యతరగతికి భారంగా మారింది. శ్రావణ మాసం ఈ నెల 23తో ముగియనుంది. ఈ నెలలో ఇప్పటి ఉన్న ముహూర్తాలతో పాటు రానున్న 10, 11, 13, 14, 15, 17, 18 తేదీల్లో ముహూర్తాలు ముమ్మరంగా ఉన్నాయి. ముఖ్యంగా 13, 14 తేదీల్లో అత్యధికంగా పెళ్లిళ్లు జరగనున్నాయి. దాంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. నగర వ్యాప్తంగా వివాహాలకు సంబంధించి కొనుగోళ్లతో వస్త్ర, బంగారు దుకాణాలలో రద్దీ పెరిగింది. ముహూర్తాలు మొదలు కావడంతో డెకరేషన్, ఫొటోగ్రఫీ, ఈవెంట్లు, క్యాటరింగ్ నిర్వాహకులు తీరిక లేకుండా ఉన్నారు.



పెళ్లి వేడుకకు సిద్ధం కల్యాణ మండపం

పెరిగిన ఖర్చులు

గతంలో వివాహ వేడుకలంటే బ్యాండ్ మేళాలు, బాజాబజంత్రీలు, పూలమండపాలు, వీడియో షూటింగ్‌లు వంటివి చాలా సాధారణంగా ఉండేవి. ప్రస్తుతం ట్రెండ్ మారింది. వివాహ ముహూర్తానికి ముందే సంగీత్ కార్యక్రమాలు, ప్రీవెడ్డింగ్ షూట్లకు ప్రకృతి సోయగాలతో పేరున్న ప్రాంతాలకు వెళ్తున్నారు. కాబోయే వధూవరులతో ప్రత్యేక పాటల రూపకల్పన చేస్తున్నారు. కల్యాణ మంటపంలో ఎల్‌ఈడీ స్క్రీన్లను ప్రదర్శించడం వంటికి చేస్తున్నారు. సంపన్నులైతే పెళ్లిళ్ల కోసం రూ.లక్షలు ఖర్చుచేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడినవారు, వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు ఖర్చుకు వెనుకాడడం లేదు. అయితే అదే సమయంలో మధ్యతరగతి వర్గాల వారు పెళ్లిళ్ల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు.

రూ.30 వేల నుంచి..

వరుసగా పెళ్లి ముహూర్తాలు ఉండడంతో కల్యాణ మండపాలకు డిమాండ్ పెరిగింది. మినీ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాళ్లు, నగర, పరిసర ప్రాంతాల్లో మొత్తంగా 60కు పైగా ఉండగా, వీటితో పాటు ఆలయాల్లో ఉన్న హాల్స్ కూడా బుక్ అయిపోతున్నాయి. ఫంక్షన్ హాళ్ల బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. మినీఫంక్షన్‌హాల్ అయితే అద్దె రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు ఉంటుంది.ఇవి కాకుండా పూల డెకరేషన్, లైటింగ్, భోజనాల ఖర్చు వంటి వాటితో కలిపి ప్రస్తుతం మినీ ఫంక్షన్ హాల్ రూ.2.50 లక్షలకు పైగా ఉంటోంది. పెద్ద కల్యాణ మండపాలు, కన్వెన్షన్ హాల్స్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు.